నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్

వినాయకుని శోభాయాత్ర, నిమజ్జనం ఏర్పాట్లను ఎల్లారెడ్డి సిఐ రవీందర్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలో సోమవారం వినాయకుని శోభాయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్ర కొనసాగే రహదారులను, వీధులను ఆయన పరిశీలించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన వీధుల గుండా కొనసాగే శోభయాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సౌకర్యంతో పాటు తదితర అధికారులతో ఆయన మాట్లాడారు. వినాయకుని నిమజ్జనం పెద్దబాగు గుర్రం మడుగు ప్రాంతాలను పరిశీలించారు. నిమజ్జనం జరిగే చోట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని నిమజ్జనంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన అన్నారు. ఆయన వెంట ఎమ్మార్వో నరేందర్, లింగంపేట్ ఎస్సై అరుణ్ కుమార్, ఎంపీఓ మలహరి, సూపరింటెండెంట్ పవన్, కార్యదర్శి శ్రావణ్ కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామపంచాయతీ విద్యుత్ సిబ్బంది తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 13, 2024 | www.navatelangana.com

కెనడి పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణ సదస్సు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కెనడి ఇంటర్నేషనల్ స్కూల్ అగ్ని ప్రమాదాల నివారణ సదస్సును గురువారం కామారెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు స్వామి అభిలాష్, రవిరాజ్ నిర్వహించారు. ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలను గురించి అగ్నిమాపక అవగాహన డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు అధికారులు వారిని కాపాడేందుకు చేసే ఉపాయాలను ఎలా అనుసరించాలో తెలియజేశారు. అత్యవసర సమయాల్లో 100 పోలీస్ శాఖ, 101 అగ్నిమాపక శాఖకు ఫోన్‌చేసి సరైన చిరునామాను తెలియజేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో కెనడి స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్ డానియల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు


సీతారాం ఏచూరి (ఫైల్)

- కమ్యూనిస్టుల ఐక్యత కోసం ఆయన విశేష కృషిచేశారు.. • సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు
- ఆయన సూచనలు పాలక ప్రతిపక్షాలకు దిక్సూచిగా ఉండేవి • సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్
- ఇరు జిల్లాల్లో నాయకుల నివాళి


కంఠేశ్వర్ : ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు



కామారెడ్డిలో..

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికే తీరని లోటని సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన గురువారం తుదిశ్వాస విడిచారు. దీంతో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో సీపీఐ(ఎం) నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏచూరి మరణానికి సంతాప సూచకంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండాను అవనతం చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కమ్యూనిస్టుల ఐక్యత కొరకు అతి నిర్మాణంలో యువత భాగస్వామ్యం కోసం విశేష కృషి చేశారని తెలిపారు. అనేక ప్రజా సమస్యల పరిష్కారంలో చట్టసభల్లో, ప్రజా ఉద్యమాల్లో, విశేష కృషి చేశారని వివరించారు. విద్యార్థి సంఘం నాయకుడిగా తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించి పార్టీ అఖిలభారత కార్యదర్శిగా సేవలందించారని నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో 2017లో బహిరంగ సభకు హాజరై ప్రజా పోరాటాలపైన తెలియజేస్తూ జిల్లాలో ఉన్న సమస్యలను కూడా ప్రస్తావించారని, ఆ రకంగా ఈ జిల్లాతో సీతారాం ఏచూరి చిరు అనుబంధం ఉన్నదని తెలియజేశారు. ఈ సంతాప సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు రామ్మోహన్, విగ్నేష్, నాయకులు రాములు, నరసయ్య, సిర్పలింగం, సతీష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళి..

జవహర్‌లాల్ నెహ్రు విశ్వవిద్యాలయం ఎకనామిక్స్‌లో గోల్డ్‌మెడల్ సంపాదించి అమర్త్యసేన్ శిష్యుడిగా అంచెలంచెలుగా ఎదిగి ఈ దేశానికి వన్నెతెచ్చిన గొప్ప నాయకుడిగా.. ఎదిగారని అతని మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. అతని మరణానికి ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, జిల్లా కమిటీ సభ్యులు దినేష్, నగర ఉపాధ్యక్షులు ఆజాద్, విశాల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో..

నిజామాబాద్ ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) కార్యాలయం వద్ద కామ్రేడ్ సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి జోహార్లు తెలుపుతూ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మ శాంతి కలగాలని కోరుకుంటూ పాటపాడి వినిపించారు.


బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..

నిజామాబాద్ బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈవీఎల్ నారాయణ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి తన 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆదర్శ కమ్యూనిస్టుగా, ఎస్ఎఫ్ఐ నాయకుడిగా, కమ్యూనిస్టు ఉద్యమ నేతగా అనేక ప్రజాపోరాటలు చేసిన వాడిగా, అలాగే ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిన సమయంలో ఎమర్జెన్సీని ఎదిరించిన ధీశాలి అని తెలిపారు. ఆయన మరణం ప్రజా పోరాటాలకు, దేశ రాజకీయాలకు, కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని వివరించారు.

నవతెలంగాణ బృందం నివాళి..

సీతారాం ఏచూరి మృతి పట్ల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నవతెలంగాణ దినపత్రిక సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రీజియన్ మేనేజర్ సురేష్, నిజామాబాద్ డివిజన్ ఇంచార్జ్ నవీన్, ఆర్మూర్ డివిజన్ ఇంచార్జి గోపి, రిపోర్టర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కనువిప్పు కలిగేలా ప్రసంగం..



నవతెలంగాణ-కంఠేశ్వర్

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో నిజామాబాద్ జిల్లాకు ఎనలేని అనుబంధం ఉన్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు తెలిపారు. 'పార్టీగా ఉద్యమంలో చిన్న జిల్లా అయినప్పటికీ 2015లో రాష్ట్ర కమిటీ సమావేశాలు నిజామాబాద్‌లో నిర్వహించారు. ఆ రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా కలెక్టరేట్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేసినప్పుడు ఆ సభలో పాల్గొని ప్రసంగించారు. జిల్లా ప్రజలందరికీ కనువిప్పు కలిగే విధంగా ఆయన ప్రసంగం కొనసాగింది. అలాగే మా నాయకత్వానికి తోడు ఉద్యమ అభివృద్ధి కోసం అనేక సూచనలు చేసి ఉత్సాహపరిచారు. ఆరోజు ఉన్నటువంటి రాజకీయ పరిస్థితులను విశ్లేషించి ప్రజలకు అర్థమయ్యేలా చెప్పారు. జరిగినప్పుడు ఎస్కేయం నిర్వహణలో ఎస్కేయం ఏర్పాట్లలో కూడా ఏచూరి ప్రధాన పాత్ర పోషించారు. ఆయన అగ్రవర్ణ బ్రాహ్మణ కులంలో పుట్టినప్పటికీ అభ్యుదయాన్ని, భౌతిక వాదాన్ని నమ్ముకుని కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. ఆయన బహుభాషా కోవిదుడు. ఆయన ఆదర్శవంతుడు. ఒక్క మాటలో చెప్పాలంటే 100శాతం ఆయన కమ్యూనిస్టుగా జీవించారు. ఆయన ఆశయ సాధన కోసం మా జిల్లా కమిటీ కట్టుబడి ఉంది.' అని తెలిపారు.

దేశానికి తీరని లోటు..

కామారెడ్డి : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. ఆయనకు సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. పార్లమెంటులో ప్రజాసమస్యలు ప్రస్తావించటం, దేశంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు ప్రస్తావించటంలో ప్రముఖపాత్ర పోషించారన్నారు. ఆయన ఇచ్చే సూచనలు పాలక ప్రతిపక్షాలకు దిక్సూచిగా ఉండేవని తెలిపారు. ఆయన మరణం దేశ ప్రజలకు తీరనిలోటని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, అరుణ్, నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కంఠేశ్వర్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..


కంఠేశ్వర్ : బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..


కంఠేశ్వర్ : జోహార్లు అర్పిస్తున్న నవతెలంగాణ సిబ్బంది

వైద్యుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలి

- డీఎంహెచ్‌ఓకు కలెక్టర్ ఆదేశం

నవతెలంగాణ-మోపాల్

వైద్యారోగ్య శాఖ పనితీరును మరింతగా పటిష్టపర్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. మోపాల్ మండలం ముదక్‌పల్లిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను, ఔషధాలు నిలువ ఉంచిన స్టోర్ రూమ్, రోగుల ఇన్ పేషంట్ వార్డు, ల్యాబ్ తదితర వాటిని సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీయగా, పలువురు అందుబాటులో లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముదక్‌పల్లి పీ.హెచ్.సీ పరిధిలో డెంగ్యూ కేసులు నమోదవుతుండడాన్ని గమనించి, అందుకు గల కారణాలు ఏమిటని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వ్యాప్తంగా గల అన్ని పీ.హెచ్.సీలు, ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని, ప్రతిరోజూ ఉదయం వేళలోనే అటెండెన్స్‌ను పర్యవేక్షించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖలో స్పష్టమైన మార్పు కనిపించాలని, క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గాడిలో పెట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని ఆసుపత్రులు, పీ.హెచ్.సీల వైద్యులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకిత భావంతో వైద్యసేవలు అందించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ఎక్కడైనా పీ.హెచ్.సీలో వైద్యాధికారి సెలవులో ఉంటే, ఇతర ఆసుపత్రుల నుండి ప్రత్యామ్నాయంగా వైద్యులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు. పాము కాటు, కుక్కకాటు మందులతో పాటు అన్ని అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు.


జిల్లా వైద్యాధికారికి సూచనలు చేస్తున్న కలెక్టర్

బెంచీలు బయట వేసి.. పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్

- చెట్ల కింద కూర్చున్న విద్యార్థులు
- కేసు పెట్టాలని డీఈఓను ఆదేశించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

తాను నిర్మించిన పాఠశాల గదుల బిల్లులు రాకపోవడంతో విసుగ చెందిన కాంట్రాక్టర్ బుధవారం సాయంత్రం పిల్లలు వెళ్లిపోయిన తర్వాత పాఠశాలలోని బెంచీలను బయట వేసి పాఠశాలకు తాళం వేసిన ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో మన ఊరు మనబడి కింద ప్రభుత్వ పాఠశాలలో 4 గదుల నిర్మాణానికి రూ.55 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఆ భవన నిర్మాణం పూర్తవుతున్నప్పటికీ పాఠశాల బిల్లు రూ.55లక్షలు రాకపోవడంతో కాంట్రాక్టర్ పాఠశాల గదులకు తాళం వేశాడు. పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో బిల్డింగ్ నిర్మించిన చీటీ పాండురంగారావు అనే కాంట్రాక్టర్ గదులలోని బెంచీలను బయటపెట్టి పాఠశాల గదులకు తాళం వేశాడు. విద్యార్థులు గురువారం పాఠశాలకు వచ్చి చూసేసరికి పాఠశాల గదులకు తాళాలు ఉండడంతో చేసేది ఏం లేక చెట్ల కింద కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్‌పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని డీఈవో రాజును ఆదేశించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయుడు బిల్డింగ్ కాంట్రాక్టర్‌పై దేవునిపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. గ్రామస్తులు కలుగజేసుకోవడంతో కాంట్రాక్టర్ పాఠశాల గదుల తాళాలను తిరిగి ఇచ్చాడు.


కాంట్రాక్టర్ తాళం వేయడంతో ఆరుబయటే కూర్చున్న విద్యార్థులు

ఏసీబీకి చిక్కిన పంచాయతీ సెక్రెటరీ

నవతెలంగాణ-నందిపేట్

నందిపేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నవీన్ కుమార్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు గురువారం పట్టుపడ్డాడు. ఘటనకు సంబంధించి ఏసీబీ డిఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంఠం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నందిపేట్‌లో ఇంటిని నిర్మించుకున్నాడు. ఇంటినెంబర్ ఆన్‌లైన్ చేయాలని కార్యదర్శిని కోరగా.. రూ.10వేలు ఇస్తేనే చేస్తానని డిమాండ్ చేయగా.. బాధితుడు రూ.8వేలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. ఏసీబీ అధికారులను సంప్రదించిన బాధితుడు గురువారం ఉదయం 11 గంటల సమయంలో రూ.8వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ చేపట్టి ఎనిమిది వేల రూపాయల నగదును, అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్ చేస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా ప్రజలను లంచం ఇవ్వాలని వేధిస్తే ఏసీబీ అధికారులను సంప్రదించాలని కోరారు.

పిఎసి నిర్వహణకు దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఏసీ (పేషెంట్ అటెండెంట్ షెల్టర్) నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ మకరంద్ తెలిపారు. సెంటర్‌ను నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, పట్టణ సమాఖ్యలు, నెహ్రూ యువకేంద్రాలు, సంక్షేమ సంబంధ సంస్థలు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఆసక్తి గలవారు నగర పాలక సంస్థలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న అంబులెన్స్

- ప్రమాదంలో బాలుడు మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్

అంబులెన్స్ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన మం డలంలోని నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా సమీపంలో గల నేషనల్ హైవే 161 పై గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. నాందేడ్ జిల్లా దెగ్లూర్ మండలం జైగవ్ గ్రామానికి చెందిన సాత్విక్ (5) అనే బాలుడికి ఆరోగ్యం బాగాలేక పోవడంతో హైదరాబాద్‌లో చికిత్స చేయించుకుని తిరిగి అంబులెన్స్‌లో తీసుకువస్తున్నారు. డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో అంబులెన్స్ డివైడర్‌ను ఢీకొంది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న సాత్విక్ ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. తండ్రి ఉమాకాంత్ శంకర్రావు మానే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించొద్దు

- లేకుంటే కఠిన చర్యలు తప్పవు
- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని మందుబాబులకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు సూచించిన నియమ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం విపరీతంగా పెరిగిపోయిందని, దీని ఫలితంగా సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా మహిళలు, పిల్లలకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీధుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరమైన, వికృత, అసభ్యకరమైన ప్రవర్తనను ప్రద ర్శిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. సాధారణంగా రోడ్డు వినియోగదారులకు, ముఖ్యంగా మహిళలు, పిల్లలకు చికాకు, ఆటంకం కలిగించి ప్రజా ప్రశాంతతకు దారితీస్తుందని, ఇటువంటి వికృత, అసభ్య ప్రవర్తన వలన పౌరులలో ముఖ్యంగా మహిళలు పిల్లలో భయాందోళన భావాన్ని కలిగిస్తుందని తెలిపారు. వీటిని పరిగణలోనికి తీసుకొని, అండర్ సెక్షన్ 22(1) (డి) హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఎఫ్ ప్రకారం నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీచేసినట్టు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తేదీ 11-9-2024 ఉదయం 6 గంటల నుంచి 30-9-2024 ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని తెలిపారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

- ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ కార్యక్రమానికి జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు జీవన్మరణ సమస్య కానేకాదని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో, ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. చదువుల్లో భవిష్యత్తులో రాణించాలంటే సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం, అలాగే సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే కామారెడ్డి జిల్లాలోని ప్రథమ స్థానంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల బృందాన్ని అభినందించారు. అలాగే ఈ సంవత్సరం కూడా ఉత్తీర్ణత శాతం మరింత పెరిగే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కలలు, సాంస్కృతిక కార్యక్రమంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘు, హైస్కూల్ హెచ్‌ఎం వెంకన్న, కళాశాల లెక్చరర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్ తహసీల్దార్‌గా సీహెచ్.కృష్ణ



నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ తహశీల్దార్‌గా సీ హెచ్.కృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో డిప్యూటీ తహశీల్దార్ గా విధులు నిర్వర్తించగా పదోన్నతిపై ముప్కాల్‌కు వచ్చారని డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రెవెన్యూ సిబ్బంది నూతన తహశీల్దార్ కృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తూ స్వాగతం పలికారు. అనంతరం నూతన తహశీల్దార్ కృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, రెవిన్యూ సిబ్బంది దశరథ్, డి.రవి, రాఘవేంద్రరావ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు..

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-రామారెడ్డి

అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురైన రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని రామారెడ్డి గ్రామానికి చెందిన ఇదులకట్ట కిషన్ (49) అనే రైతు అనారోగ్యంతో పాటు, ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య శాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మొబైల్ - యాప్ ద్వారా పరిశీలించి నమోదు చేస్తున్నామని ఎంపిఓ రాజ్ కాంత్ రావు అన్నారు. గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకొవడం జరుగుతుందని ఎంపిఓ రాజ్ కాంత్ రావు అన్నారు. ఎల్ఆర్ఎస్‌లో చేసుకున్న దరఖాస్తుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి జియో ట్యాగింగ్ ద్వారా ఎల్ ఆర్ ఎస్ 2020 యాప్లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి తిరునగురి శ్రీధర్, కారోబర్ నరేందర్, చెక్ పావర్ ఎర్రోళ్ల సాయన్న, సాయిబాబా, అబ్దుల్ గఫర్, దరఖాస్తు దారులు ఉన్నారు.

నిత్యం ఫాగింగ్ చేపట్టాలి

- ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువ సంఖ్యలో ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో ప్రతిరోజు ఫాగింగ్ చేయించడం జరుగుతుందని, అన్ని గ్రామాల్లో జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకు ఫ్యాగింగ్ చేపట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పలు గ్రామాల్లో సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి పరిశీలిస్తామని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం ఏ ఒక్కరోజు మినహాయింపు లేకుండా ప్రతిరోజు ఫాగింగ్ చేపట్టాలని పేర్కొన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆటోల ద్వారా మిగతా గ్రామాల్లో ద్విచక్ర వాహనాల ద్వారా ఫాగింగ్ చేయడం కొనసాగుతుందన్నారు.ఇదే కాకుండా గ్రామాల్లో నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లారని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని ఎంపీ ఓ శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శులకు సూచించారు.

గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

- మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్


నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎస్ఐ మహేష్

నిజామాబాద్ నగరంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని 3వ టౌన్ ఎస్ఐ మహేష్ తెలిపారు. సార్వ జనిక్ గణేష్ ఉత్సవ నిర్వాహకులు సూచించన మేరకు ఈనెల 17న గణేష్ నిమజ్జనం ఉంటుందని అన్నారు. కావున గణేష్ నిమజ్జనం ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. దుబ్బ నుండి ప్రారంభమయ్యే గణేష్ నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని అన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో చెరువులు కుంటల వద్ద జాగ్రత్తగా ఉండాలని, చిన్నారులను అనుమతించొద్దని ఆయన సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన గణేష్‌లను ప్రతి ఒక్కరూ పోలీస్ స్టేషన్ పరిధిలో సూచించిన విధంగా నిమజ్జనానికి బయలుదేరాలని తెలియజేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు తూచా తప్పకుండా పోలీస్ శాఖ అధికారులు సూచించిన నియమ నిబంధనలను పాటించాలన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మిసిమి విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యెనుగందుల సౌమిత్, శాశ్వంత్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. గురువారం ఆర్మూర్‌లోని విశాఖ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ జట్టుకు విద్యార్థులు సౌమిత్, శాశ్వంత్ ఎన్నికయ్యారు. సుమారు 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ సెలెక్షన్‌లో మిసిమి విద్యార్థులు ఎంపికవ్వడం పట్ల కరస్పాండెంట్ బాలి రవీందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెలలో 14,15 తేదీల్లో హన్మకొండ లోని జవహర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటిలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, పిఇటి సంజీవ్, టీచర్లు అభినందించారు.

వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్స్యూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని, ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా కమిటీగా కార్మిక శాఖ సహాయ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్ మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి అమలు చేస్తున్న ప్రమాదబీమా రూ.6లక్షల30వేల నుండి రూ.5 లక్షలకు తగ్గించి సహజ మరణం బీమా రూ.1లక్ష30వేలు, శాశ్వత అంగవైకల్యం రూ.5 లక్షలు, పాక్షిక అంగవైకల్యం రూ.4 లక్షలు ఈ సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించి ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ లేకుండానే అసత్యాలతో బోర్డు ఆమోదంతోనే టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించిండం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులు ఉంటే, 15.9 లక్షల మంది బోర్డులో రెన్యూవల్ చేసుకున్న వర్కర్స్ మాత్రమే ఉన్నట్లు చూపారన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను బిల్డింగ్ కార్మికులకు అందకుండా చేసి, కాకులను కొట్టి గద్దలకు వేసిన చందంగా ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టి పెద్ద పెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టటం కోసమే ప్రభుత్వం టెండర్లకు పిలుస్తున్నదని ఆరోపించారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వటం వల్ల నేడు కార్మికులకు వస్తున్న స్కీములు అందకుండా పోతాయన్నారు. చిన్న చిన్న కారణాలు చూపి తప్పులు వెతికి కార్మికులకు నష్టపరిహారాలు అందకుండా చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను బడా ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచీపెట్టడం, అధికారుల కమీషన్ల కోసమే కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్మికుల సంక్షేమ పథకాలు ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కోసం కాకుండా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, జిల్లా నాయకులు సాయరెడ్డి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్ /ఏర్గట్ల/మెండోర



భీంగల్ రూరల్: చెక్కులు అందజేస్తున్న నాయకులు



ఏర్గట్లలో...

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని భీంగల్ మండల కేంద్రానికి చెందిన 35 మంది లబ్దిదారులకు సుమారు 10లక్షల50వేల రూపాయల వరకూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. అనంతరం బొదిరే స్వామి, జేజే నర్సయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు భోధిరే స్వామి, టౌన్ అధ్యక్షుడు జేజే నర్సయ్య, సీనియర్ నాయకులు అనంతరావు,గోపాల్ నాయక్, రాజు, జాన్, ఆకాష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలకేంద్రానికి చెందిన ఐదుగురు అనారోగ్య సమస్యలతో చికిత్స చేయించుకోగా వారికి 2 లక్షల 40 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు గురువారం బాధితుల ఇంటి వద్దకు వెళ్ళి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శివన్నోళ్ళ శివకుమార్ మాట్లాడుతూ.... బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి కృషితో బాధితులకు డబ్బులు మంజూరయ్యాయని అన్నారు. అనంతరం బాధితులు సునీల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి, నాయకులు ముస్కు మోహన్,పన్నాల నర్సారెడ్డి,బద్దం లింగారెడ్డి, రొక్కెడ చిన్న సాయన్న, బొర్రన్న, కల్లెడ పురుషోత్తం, మేర్గు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెండోరా: బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునిల్ కుమార్ ఆధ్వర్యంలో దూదిగాం, చాకిర్యాల్ గ్రామాలలో సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్ యువసేన సభ్యులు దూదిగాం గ్రామానికి చెందిన గోపు.సౌమ్య కు 50వేలు చాకిర్యాల్ గ్రామానికి చెందిన అల్లం పెద్ద చిన్నుబాయి కి 36వేలు సిఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఇఛార్జ్ నేల లింగన్న, నాయకులు పసుల శ్రీనివాస్, రాజేందర్ , రాజేందర్, నవీన్, రఫీ , బొలిషెట్టి శ్రీను, శ్రీను సాగర్, ఆరెపల్లి మురళి, అల్లం మధు, మాలేపు రాము, నర్సయ్య, దేవేందర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

- సిపిఐ డిమాండ్

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్రములో పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా కెసిఆర్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా జరుపకపోవడం చాలా బాధాకరమని తెలంగాణా రాష్ట్రంలో తెలంగాణా ప్రజల ముందు కేసీఆర్ చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. గురువారం నగరంలోని సిపిఐ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల సంస్మరణ సభకు ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సాయుధ పోరాటంలో నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించి కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వాన పెద్దఎత్తున కార్యకర్తలు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన వీరోచిత పోరాటంలో తమప్రాణాలు సైతం లెక్క చేయలేదని సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. బాంచెన్ నీ కాళ్ళు మొక్కుతా దొర అన్నవారితో బందూకులు చేతపట్టించి నిజాంచెరలో ఉన్నా పది లక్షల ఎకరాల భూమిని పంచిపెట్టిన ఘనత సిపిఐకే దక్కుతుందని అన్నారు. డివిజన్ కార్యదర్శి ఆరెపల్లి సాయిలు మాట్లాడుతూ.. నాడు జరిగిన స్వతంత్ర ఉద్యమంలోగాని తెలంగాణా సాయుధ పోరాటంలో గాని సంబంధం లేని బీజేపీ నాయకులు దెయ్యాలు వేదాలు వళ్ళించినట్టుగా తెలంగాణ రైతాంగా సాయుధ పోరాటంలో హిందువులు మాత్రమే పాల్గొన్నారని అనడం సిగ్గుచేటని అన్నారు. నాడు జరిగిన సాయుధ పోరాటంలో ఆరుట్ల కమలదేవి, బద్దం ఎల్లారెడ్డి, రావినారాయణ రెడ్డి, మగ్దుం మోహినొద్దీన్, షేక్ బందగీలు కమ్యూనిస్ట్ నాయకుల నేతృత్వంలో వీరోచిత పోరాటంలో 4500 మంది మరణించిన చరిత్ర తెలియకుండా మాట్లాడడం మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాజన్న, స్వరూపరాణి, గంగన్న, రఘు, రంజిత్, నరేష్, మంగ, మౌలానా, నవాబ్, మాదిరే లక్ష్మన్, జిన్నా సుమన్, నరేందర్, అలీ, సాయిలు, హలీమ్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఆరోగ్యం, పరిశుభ్రతపై దృష్టి సారిచాలి
- మండల ప్రత్యేక అధికారి యోహన్



భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వం సూచించిన విధంగా ప్రతి వసతి గృహంలో అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి మోహన్ ఆదేశించారు గురువారం మండలంలోని ధర్మారంభి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రం, నడ్పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామపంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు, సురేంద్ర మొగులయ్యరుతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల అంగన్వాడీ కేంద్రాల బాధ్యులతో వివరాలను అడిగి తెలుసుకుని వంట గదులను, వంట పాత్రలను తదితర వాటిని పరిశీలించారు ఈ సందర్భంగా వారికి పలు సూచనలను సలహాలను అందజేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని మెనూ ప్రకారం ఎప్పటికప్పుడు భోజనాలు, టిఫిన్ తదితర వాటిని అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలిపి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

నవతెలంగాణ -ఏర్గట్ల

మండలకేంద్రంలోని ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

శివయూత్ ఆధ్వర్యంలో నిత్య అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న శివ యూత్ సభ్యులు

భీంగల్‌రూరల్: భీంగల్ పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘంలో వినాయక చవితి ఉత్సవంలో భాగంగా శివ యూత్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 16 సంవత్సరాల నుండి వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని యూత్ సభ్యులు తెలిపారు.

స్టార్ హెూటల్ పై పోలీసుల దాడి

- అదుపులో 13 మంది
- నకిలీ నోట్ల కట్టలు లభించినట్టు సమాచారం!

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంటర్‌క్వాంటినెంటల్ హోటల్లో పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడి నకిలీ నోట్ల కట్టలు లభించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హెూటల్‌లో సోదాలు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. హైటెక్ వ్యభిచారం నడుస్తుందనే పక్కా సమాచారంతో దాడిచేసి 13మందిని అదుపులోకి తీసుకుని డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. పట్టుబడిన ఎనిమిది మందిలో ఖాందేశ్ అశోక్, నల్ల శ్రీనివాస్, ముస్కు రాజా, కుంట లింగన్న, సామ గంగాధర్, అలల లింగారెడ్డి, సింగిరెడ్డి భరత్, వుంతూరు మధుసూదన్ ఉన్నట్లు సీపీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. అలాగే వీరి వద్ద నుంచి 13 సెల్‌పోన్లు, రూ. 38,760 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన విటులంతా ఆర్మూర్ పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. హైదరాబాద్ ఫిలింనగర్‌కు చెందిన డ్రైవర్ మధుసూదన్ యువతులను రప్పించడంపై పోలీసులు ఆరాతీస్తున్నారని తెలిసింది. నకిలీ నోట్లు పట్టుకోవడం జిల్లాలో కలకలం రేపుతోంది.

సీతారాం ఏచూరి మృతికి బీఎల్‌ఎఫ్ తీవ్ర దిగ్భ్రాంతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు దండి వెంకట్, నాయకులు సిద్దిరాములు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి చెందడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వామపక్ష ఉద్యమానికి తీరనిలోటుగా బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కమిటి భావిస్తుందని తెలిపారు. ఆయన ఆయన మృతి భారతదేశ వామపక్ష ఉద్యమానికి కోలుకోలేని దెబ్బలాంటిదని పేర్కొన్నారు.

గౌడ యూత్ మండపం వద్ద గణపతి హెూమం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో గౌడ యూత్ గణేష్ మండపం వద్ద గురువారం వేద పండితులు సత్యానంద శర్మ ఆధ్వర్యంలో సంఘ, యూత్ సభ్యుల సమక్షంలో గణపతి హెూమం నిర్వహించారు. గణపతి హెూమంలో పలువురు గౌడ కులస్తుల జంటలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురోహితులు సత్యానంద శర్మ మాట్లాడుతూ..ప్రతి గణపతి నిమజ్జనం రాత్రి 12 గంటల లోపు ముగిసేలా అందరు కృషి చేయాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు చొరవ తీసుకొని తమ పిల్లలకు చెప్పాలని ఆయన కోరారు. వినాయక నిమజ్జనం రోజు మధు పానీయాలు, అసభ్య నృత్యాలతో అన్యమతస్తులు వెక్కిరించే పనులు చేయొద్దన్నారు.

రెండవ రోజు హెల్ప్ డెస్క్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో నూతన పీజీ అడ్మిషన్స్ జరుగుతున్న సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అడ్మిషన్స్ కోసం గ్రామీణ ప్రాంతాల నుండి యూనివర్సిటీకి వచ్చే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అడ్మిషన్స్ పూర్తయ్యేంతవరకు పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. యూనివర్సిటీ అధికారులు ఏదైనా ఇబ్బందులు గురి చేస్తే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎటువంటి సహాయం కావాలన్నా మాకు సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు ప్రిన్స్, రవీందర్, బిందు, రాకేశ్, మణికంఠ, రాకేశ్, సాయి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు శ్రీపతి శేఖర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం జక్రాన్‌పల్లి మండల ంలోని బ్రాహ్మణపల్లి గ్రామం నుండి మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సాయి రెడ్డి ఆధ్వ ర్యంలో మాజీ సర్పంచ్ పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు శ్రీపతి శేఖర్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. హైదరాబాద్‌లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి నివాసంలో బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి చేనేత కార్మికులకు రుణమాఫీ చేయడం, అభివృద్ధి పనులను చూసి పార్టీలో జాయిన్ అయినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పోతె గంగాధర్, ఉపాధ్యక్షులు గూడ సాగర్, క్యాషియర్ రణధీర్, ప్రధాన కార్యదర్శి ఉత్తునూరు గంగాధర్, సలహాదారులు మాదర్ సురేష్, సయ్యద్ సాదిక్, గోద ప్రణీత్ పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏడిఎ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిమ్మాజివాడి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి, మక్క, సోయా పంటలను ఏడీఏ లక్ష్మి ప్రసన్న, ఏఈవో శ్రీలక్ష్మి పరిశీలించారు. అధిక వర్షాల వల్ల పత్తి పంట నీరు పట్టింది. దీనికోసం రైతులు 19:19:19 మైక్రో న్యూట్రియంట్స్ గానీ కాపర్ ఆక్సీక్లోరైడ్ మొక్క మొదల దగ్గర పిచికారీ చేయవలసిందిగా సూచించారు. రైతులు జింజిల్కార్ అశోక్‌రావు, పొన్న నర్సయ్య మల్లయ్య, సాయిలు, సాయిరెడ్డి, చిన్న వెంకటి పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న ఏడిఎ

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఐసిడిఎస్ మండల పర్యవేక్షకురాలు విజయ రాణి

నవతెలంగాణ-ఎడపల్లి

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారి బాల, బాలికల పట్ల అప్పుడే జన్మించిన బిడ్డను కూడా తల్లిదండ్రులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్, మండల పర్యవేక్షకురాలు విజయారాణి అన్నారు. గురువారం మండలంలోని జైతాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం లో భాగంగా పోషణ మాసోత్సవ కార్యక్రమాలను జైతాపూర్ ఎంఎస్‌సి అంగన్వాడీ ఉపాధ్యాయులు నిర్వహించారు. కార్యక్రమంలో జైతాపూర్, ఎంఎస్‌సిఫారం అంగన్వాడీ కేంద్రం ఉపాధ్యాయులు వకుళ దేవి, సుప్రియ, గర్భిణీ మహిళలు, మహిళలు, అంగన్వాడీ కేంద్రాల చిన్నారి బాలబాలికలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల పర్యవేక్షకురాలు

గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని శాకారి కుంటలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను తహసీల్దార్ శివప్రసాద్, సీఐ సంపత్ కుమార్, ఎస్ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. గణేష్ నిమజ్జనం సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్‌కు సూచించారు. పంచాయతీ సిబ్బంది నిమజ్జన సమయంలో చెరువుల వద్ద ఉండి సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలిపారు.

పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని సుంకిని గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్ గయక్వాడ్ హనుమంతు పి.సి.సి అధ్యక్షులుగా బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ నూతనంగా నియమించిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఓటర్ జాబితా సిద్ధం చేయాలి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-పిట్లం

స్థానిక సంస్థలకు గానూ ముందస్తు ఓటర్ జాబితా సిద్ధం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా వార్డుల వారీగా ఓటర్ జాబితాను సిద్ధం చేయాలన్నారు. అసెంబ్లీ ఓటర్ల జాబితాకు సంబంధించి పోలింగ్‌స్టేషన్‌ల వారీగా ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ సర్వే గురించి సమీక్షించారు. ఎంపీడీవో కమలాకర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెంగాణ-కామారెడ్డి

రక్తహీనతను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడవ జాతీయ పోషణ మాసంలో భాగంగా గురువారం కే.జీ.బీ.వీ. టేక్రియాల్, జెడ్.పి.హెచ్.ఎస్. టేక్రియాల్ పాఠశాలల విద్యార్థులకు రక్తహీనత పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తహీనత పట్ల విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. రక్తహీనతను తగ్గించుటకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదే విధంగా కలెక్టర్ మాట్లాడుతూ కిషోర్ బాలికలు రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని తగిన వైద్య పరీక్షలు చేసుకోవాలని, అవసరమైన చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్ని పాఠశాలలో కిషోర బాలికలకు తగిన పరీక్షలు ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో 363 మంది విద్యార్థినులకు రక్తహీనత పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇందుప్రియ, వైస్ చైర్మన్ అనిత, బిడబ్బు బావయ్య, డిఎంహెచ్వో చంద్రశేఖర్, డి.ఈ.ఓ రాజు, సిడిపిఓలు, సూపర్‌వైజర్‌లు హెల్త్ డిపార్ట్ స్టాఫ్ ఒంగోలు ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

గ్రామస్తుల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

నవతెలంగాణ-బోధన్

పాఠశాలలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల పాత్ర ఎంతో కీలకమని బోధన్ మండల విద్యాశాఖ నోడల్ అధికారి నాగయ్య అన్నారు. బోధన్ మండలంలోని ఖండ్‌గాం ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని గురువారం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల శ్రమతో పాటు తల్లిదండ్రులు సైతం ఇంటి వద్ద విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు అందిస్తూ మంచి విద్యను గావించేందుకు ప్రోత్సహించాలని ఆయన కోరారు. పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థులు నాణ్యమైనవిద్యను అందుకోవాలంటే ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. మారుమూల ప్రాంతంలో పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దారని అన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలను ఆహ్లాదకర వాతావరణంతో పాటు విద్యార్థులకు కనువిందు చేసే విధంగా పాఠశాలలను తీర్చిదిద్దుతారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బాలాజీ దుర్గప్రసాద్, రేణుక, సురేఖ, విదేశ్ బాబు, లక్ష్మి, రేఖను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ లాలయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజీవ్ గాంధీ, కల్దుర్కి కాంప్లెక్స్ సెక్రటరీ హన్మంతు, సిఆర్పీ బాబు, అరవింద్, గ్రామస్తులు అశోక్ పటేల్, ప్రకాశ్, ఎంపీటీసీ బాబు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న పలువురు

ఆరో తరగతి ప్రవేశాలకు 16వరకు గడువు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో 2025-2026 విద్య సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాల దరఖాస్తులకు సెప్టెంబర్ 16వ చివరితేదీ అని విద్యాలయ ప్రిన్సిపాల్ సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష 18 జనవరి 2025న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్త్రజూం://ఖుజశీఖుఖు.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల పిల్లలకు 75శాతం సీట్లను భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు.

అక్రమ ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో అక్రమంగా ఇంటిని నిర్మించిన బూర్ల వెంకటేశం ఇంటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ఫోటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. యూనియన్‌కు చెందిన శ్రావణ్ ఇల్లు వెంకటేష్ నూతన ఇంటి కారణంగా కూలిపోయే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి అక్రమ ఇంటి నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బిక్షపతి, ఉపాధ్యక్షులు ఆసం సిద్ధరాములు, శ్రీనివాస్ చారి, రామగల్ల బాబు, మిద్దె లోకేష్, వంశీ, నర్సింలు, రాజేందర్, గౌస్, తదితరులున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం

నవతెలంగాణ-బోధన్

పోషణమాసం కార్యక్రమాలను గాంధీనగర్ 13వ వార్డు అంగన్వాడీ కేంద్రాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. పోషన్ ది పడాయి బి లో భాగంగా పిల్లలతో కథలు చెప్పించి ప్రీస్కూల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ లక్ష్మి, హాజీరా బేగం, కాంతాబాయి, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన తోకల లింగం మృతిచెందగా వారి కుటుంబానికి నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నా రెడ్డి మోహన్‌రెడ్డి రూ.2000 నగదు, 50 కేజీల బియ్యాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగం అకాల మరణం కుటుంబానికి తీరని లోటని, కుటుంబానికి ధైర్యం చెప్పి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు లక్ష్మాగౌడ్, కాంగ్రెస్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగరావు, గణేష్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పోసానిపేట విద్యార్థి

నవతెలంగాణ-రామారెడ్డి

34వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పోసానిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని సిహెచ్ నేహా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా నేహాను, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు విడిసి సభ్యులు అభినందించారు. ఈనెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లోని మౌలాలి హౌసింగ్ బోర్డ్ గ్రౌండ్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విడిసి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంటి పరీక్ష శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బిఎస్‌కె ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించారు. 287 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని, 18 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని, వారికి కంటి అద్దాలు వినియోగించుకోవాలని సూచించారు. ఇద్దరు విద్యార్థులకు కంటి సమస్యల వల్ల హైదరాబాద్‌లోని సరోజిని దేవి కంటి ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. 14 మంది విద్యార్థులకు చిన్నచిన్న కంటి లోపాలు ఉండటంతో మందులు అందజేశారు. రాబోయే దీపావళి పండుగ, హోలీ పండుగకు కంటికి వచ్చే ప్రమాదాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు సురేష్, మారుతి బాబు, ప్రధానోపాధ్యాయులు వీరన్న, కంటి వైద్యులు హరికృష్ణరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జెండావిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో పదవ శాఖ మహాసభ సందర్భంగా సీపీఐ(ఎం) జెండాను ఆవిష్కరించినట్లు జిల్లా కమిటీ సభ్యులు కొత్త నరసింహులు తెలిపారు. మహాసభ ప్రారంభానికి ముందు పార్టీ మండల కార్యదర్శి పేరు నర్సవ్వ సీపీఐ(ఎం) జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో గతంలో మహాసభ నుండి ఇప్పటివరకు జరిగిన పార్టీ కార్యక్రమాలు, విజయాలపై చర్చించినట్లు తెలిపారు. జంగంపల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు అనేక విజయాలను సాధించిందని ప్రధానంగా ఇళ్ల స్థలాల కోసం పోరాడి పట్టాలు సాధించిన ఘనత సిపిఐ(ఎం) దేనని తెలిపారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామంలో ఉన్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింలు, కొండం పద్మ, కర్రెళ్ల మల్లయ్య, కొంగ సత్యనారాయణ, భక్తి సత్యవ్వ మాడుగుల శ్యామల, పేరం రమణ, దేవరాజ్, సావిత్రి, బాలరాజ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై సెమినార్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా మహిళ విభాగం ఆధ్వర్యంలో వివిధ చట్టాలపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి అధ్యక్షత వహించి ఆమె మాట్లాడుతూ.. ఉర్దూ మీడియం ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థినులు వివిధ చట్టాలపైన ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులుగా ఉపన్యాసించిన విద్యార్థినులలో ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతులుగా గెలుపొందిన వారికి సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ భారత్, తరపున బహుమతులను ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహచట్ట పరిరక్షణ కమిటీ జిల్లా మహిళా కార్యదర్శి దొమ్మటి లలిత, పట్టణ మహిళ కార్యదర్శి ఎస్.జమున, మహిళా ప్రతినిధులు షేక్ ఇర్ఫానా, షాహినా, కళాశాల ఉర్దూ మీడియం అధ్యాపక బృందం, విద్యార్థినీలు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పలువురు

ఆలయాభివృద్ధికి విరాళం

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మినరసింహస్వామి ఆలయ అభివృద్ధికి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన కేస్కర్ బలరామన్ రూ.42 వేలు విరాళాన్ని ఆలయ అధికారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శనిగారం కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. భక్తుల సహకారంతో ఆలయాన్ని రోజురోజుకు అభివృద్ధి చేయడం జరుగుతుందని, అందులో భాగంగానే లక్ష్మినరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నవతెలంగాణ-బోధన్

సమగ్ర శిక్షా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సెప్టెంబరు 17వ తేదీ నుంచి నిర్వహించడం జరుగుతుందని, కావున నిర్ణయించిన తేదీల ప్రకారం జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలు 17న నిర్వహించబడుతుందని తెలిపారు. 17న తెలుగు , గణితం, 18న హిందీ , బయో సైన్స్, 19న ఇంగ్లీషు , ఫిజి, సైన్స్ సామాజిక అధ్యయనాలు 20న సంబంధిత వేదికల్లో నిర్వహించబడతాయని తెలిపారు. కావున ఉపాధ్యాయులందరూ సంబంధిత సబ్జెక్ట్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అలాగే కాంప్లెక్స్ సమావేశాలకు ప్రతి ఒకరు హాజరయ్యేలా చూడాలని హెచ్ఎంలకు ఆదేశించారు. కాంప్లెక్స్ సమావేశ రోజుల్లో ఎటువంటి సెలవు మంజూరు చేయడం జరగదని పేర్కొన్నారు. సమావేశాలు ఉదయం 9.00 నుండి 4.15 గంటల వరకు మండల నోడల్ అధికారులతో సమన్వయంతో అజెండా ప్రకారం సమావేశాన్ని నిర్వహించాలిమని సూచించారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అమలు చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు సిద్ధార్థ తెలిపారు. క్రిమిలేయర్ అమలు కొరకు సెప్టెంబర్ 1న ఆదిలాబాద్ నుండి ప్రారంభమైన పాదయాత్ర గురువారం భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలో దళిత సంఘ నాయకులతో మాట్లాడుతూ ఎస్సీలలో నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయని, బాధలను గుర్తించి ఓసి, బీసీలలో క్రిమిలేయర్ అమలు చేసిన విధంగానే ఎస్సీలలో కూడా క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లింగం, కామారెడ్డి మండల అధ్యక్షులు బాబు, గ్రామస్తులు, దళిత సంఘం నాయకులు, తదితరులున్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు

వీధి కుక్కలను నియంత్రించాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో వీధి కుక్కలతో జనం ప్రాణాలు కోల్పోతున్నారని కావున అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కలను నియంత్రించే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ నాయకులు మోసిన్ అన్నారు. గురువారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద మహిళకు చెందిన బాలుడిని వీధి కుక్కలు బలిగొన్నాయని అన్నారు. వీధి కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ పాలకులు, అధికారులు విఫలమయ్యారని అన్నారు. కావున కుక్కకాటు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఐక్యమత్యమే సంఘానికి బలం

- రైతుల కోసమే ఎఫ్‌పిఓ ఏర్పాటు
- నబ్కాన్ ప్రతినిధి థామస్

నవతెలంగాణ-మద్నూర్

ఐక్యమత్యమే సంఘం అభివృద్ధికి బలమని.. రైతుల కోసమే ఎఫ్పిఓ ఏర్పాటు చేసినట్టు నాబార్డు సహకారంతో కొనసాగించే నబ్కాన్ ప్రతినిధి థామస్ తెలిపారు. ఈ సంఘం ద్వారా రైతులకు ఎన్నో రకాల లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఎరువులు, విత్తనాలతో పాటు పండించిన పంటలు మద్దతు ధరతో అమ్మడం కొనడం చేసుకోవచ్చని ఆ ప్రతినిధి సూచించారు. మద్నూర్ ఎఫ్‌పిఓ లాభాల బాటలో కొనసాగుతుందని ఈ సంఘం పరిధిలో దాదాపు 750 మంది సభ్యులుంటే మరింత లాభాలు చేకూరుతాయని, ప్రస్తుతం 472 మంది మాత్రమే వాటాదారులుగా చేరడం మిగిలిన వారిని వాటాదారులుగా చేర్పించడంలో ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని కోరారు. సభ్యుల సంఖ్య పెరిగితే సంఘంలో నిధులు పెరుగుతాయని నిధులతో సంఘం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఈ మహాజనసభలో వ్యవసాయాధికారి రాజు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుజాత, మద్నూర్ ఇంచార్జ్ పశువైద్య అధికారి సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు మాట్లాడారు.



మాట్లాడుతున్న ప్రతినిధి

గణేష్ మండపాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

రామారెడ్డి : మండలంలోని రామారెడ్డి, మద్దికుంట, కన్నాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నరేష్, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్ రావు, మాజీ సర్పంచ్ రాజనర్సు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజ న సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండపాల నిర్వాహకులు, నాయకులు డల్లా సురేష్ ఏనుగు శ్రీనివాస్, మొద్దోళ్ల సురేష్, గంగాధర్, సుబ్బు సాయిలు, మచ్చూర్ గంగాధర్, మచ్చూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని కూనేపల్లి శివ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్థానిక ఎస్సై ఈ.సాయన్నను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణేష్ మండలి నిర్వహకులు దేవిదాస్, గణేష్, వినోద్ కుమార్, శ్రీకాంత్, సురేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని పలు గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ అన్నదాన కార్యక్ర మాలను చేపడుతున్నారు. మండల కేంద్రంలోని అంబేద్క ర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎడపల్లి నాయబాదిలో జైహనుమాన్ గణేష్ మండపం వద్ద మాజి సర్పంచ్ శంకరనాయుడు ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అన్నదానంలో పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు..

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలో సిరిసిల్ల రోడ్‌లోని సంతోషి ఆదర్శ సంఘం గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కైలాస్ శ్రీనివాస్‌రావ్, గణేష్ మండలి సభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


రామారెడ్డి : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై

పసుపు పంట పరిశీలన


పంటను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఇస్సపల్లి గ్రామంలో గురువారం ఉద్యానవన శాఖ జెడిహెచ్ బండారి శ్రీనివాస్, పసుపు పరిశోధన శాస్త్రవేత్త మహేందర్‌రెడ్డి పసుపు పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పసుపు పంట మర్యాకు తెగులు. దుంప కుళ్ళ రోగం వచ్చే పరిస్థితి ఉందని, దాని రక్షణకు ప్రొపి కొనజోల్, సాఫ్, టాప్స్నమ్ మందులు వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏరియా హెచ్ఓ సంధ్యారాణి, రైతులు నూతల శ్రీనివాస్‌రెడ్డి ముత్యం శ్రీనివాస్. కోమటి సాయన్న దారుల పెద్ద ముత్తన్న భాను, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- డిఎల్‌పిఓ శివకృష్ణ

నవతెలంగాణ-బాల్కొండ

వ్యాధుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిఎల్‌పిఓ శివకృష్ణ అన్నారు. ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ గురువారం బాల్కొండ మండల పరిధిలో పర్యటించారు. బాల్కొండ, బోదేపల్లి గ్రామాల్లో మురికి కాలువలో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇళ్ల పరిసరాలలో నిలువ ఉన్న నీళ్లను తొలగించి యాంటి లార్వా స్ప్రే చేయాలని అన్నారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో వ్యాధుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మండల పరిధిలోని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ గంగ మోహన్, బాల్కొండ, బోదేపల్లి పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్ రెడ్డి, వనిత, తదితరులు ఉన్నారు.

చిరుత సంచారం



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్‌పూర్ గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గురువారం తెలిపారు. గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

ఎంసిఎన్ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో పీజీ ప్రవేశాల కై వెరిఫికేషన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో భారీగా విద్యార్థులు వెరిఫికేషన్ నిమిత్తం తరలి వచ్చారు. దీంతో ఆర్ట్స్ కళాశాల పరిసరాలు సందడిగా మారాయి. అటు డిపార్ట్మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఎంసిఎన్) ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వెరిఫికేషన్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ విద్యార్థులు శ్రీను రాథోడ్, కార్తీక్, ప్రదీప్, శివ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై భౌతిక దాడిని ఖండించిన బార్

- నవతే జగన్ మోహన్ న్యాయవాదిగా అనర్హుడు



మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది వసంత్ రావుపై భౌతిక దాడి చేసిన జగన్ మోహన్ నవతే తీరును బార్ అత్యవసర సమావేశంలో పలువురు సీనియర్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ న్యాయవాదులు ఎర్రం గణపతి, శ్రీహరి ఆచార్య, పిట్లం శ్రీనివాస్, పరుచూరి శ్రీధర్, కృపాకర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. జిల్లాకోర్టు ప్రాంగణంలో న్యాయవాదిపై దాడిని న్యాయవాదులపై దాడిగా వారు అభివర్ణించారు. జగన్ మోహన్ నవతే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయకుండా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులు ఉన్నాయని వారు తెలిపారు. అలాంటి వ్యక్తి కోర్టు పరిధిలో ఉండి చట్ట విరుద్ధంగా వ్యవహరించడం చాలా పెద్ద తప్పిదంగా వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జగన్మోహన్ నవతే వ్యవహార శైలిని బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. అనంతరం బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో ఒక కమిటీని నియమించామని, వారు నివేదికను సమర్పించగానే జగన్మోహన్ నవతే పై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే విధంగా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సభ్యత్వం నుండి సస్పెన్షన్ చేస్తు తదుపరి క్రమ శిక్షణ చర్యల కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. గత ఫిబ్రవరి నెల నుండి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయకుండా జగన్మోహన్ నవతే పై ఉత్తర్వులు ఉన్నాయని వీటిని కక్షిదారులు గమనించాలని కోరారు. ఆయన కోర్టు ఆవరణలో బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావుపై దాడి చేసి గాయ పర్చడం, కులం పేరుతో దూషించడం, అవమానించడం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలకు సన్నద్ధం అవుతున్నట్లు జగన్ మోహన్ గౌడ్ తెలిపారు.

సొసైటీ డబ్బులను దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

టిసిఎస్-3 నిజామాబాద్ అధ్యక్షులు కొత్తూరు రవీంధర్ గౌడ్ సొసైటీ డబ్బులను దుర్వినియోగం చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని శ్రీ భవాని కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం నిజామాబాద్-3 టాడి టాపర్స్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ భవాని కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం నిజామాబాద్-3 టాడి టాపర్స్ మాట్లాడుతూ.. భవాని కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం నిజామాబాద్ -3 ప్రస్తుత అధ్యక్షులు కొత్తూరు రవీంధర్ గౌడ్ భవాని కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం నిజామాబాద్-3 డబ్బులను సేపూర్ స్వామిగౌడ్, సేపూర్ సుమన్ గౌడ్ సొసైటీకి సంబంధం లేని వ్యక్తులు అయిన సేపూర్ జయసింహ గౌడ్, బుర్ర శ్యాంసుందర్ గౌడ్, ఎస్. నాగరాజు గౌడ్‌తో కుమ్మక్కై పంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులే యజమానులుగా డిపోను నడుపుతున్నామని బయటకు చెబుతూ కార్మికులకు మాత్రం గత సంవత్సరం నుండి కేవలం నెలకు రూ.4 వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కార్మికులకు ఎటువంటి సంబంధం లేకుండా డిపోలో కార్మికులకు చెందిన వాటాలను అక్రమంగా బయట వ్యక్తులకు లక్షల రూపాయలకు అమ్ముకున్నారన్నారు. టిసియస్-3 అధ్యక్షులు కే. రవీందర్ గౌడ్ సొసైటీ బైలాకు విరుద్ధంగా వెళుతూ కార్మికులకు రావాలసిన వాటాలను లాభాలను ఇవ్వకుండా సొంత నిర్ణయాలు తీసుకొని బయట వ్యక్తులకు అప్పజెప్పి అక్రమాలకు పాల్పడుతున్నందున విచారణ జరిపి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. డిపో నిర్వహణలో అక్రమంగా చొరబడిన వ్యక్తులు సేపూరు జయసింహా గౌడ్, బుర్ర శ్యాంసుందర్ గౌడ్, ఎస్. నాగరాజు గౌడ్లను డిపోనుండి బయటకు పంపాలని, డిపోను కార్మికులే నిర్వహించుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బుర్ర లక్ష్మీ నరస గౌడ్, రాజా గౌడ్, లక్ష్మణ్ గౌడ్, తిరుమలేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వద్ద

అగ్నిమాపక శాఖ నిబంధనలను పాటించాలి

- నిజామాబాద్ ఫైర్ స్టేషన్ అధికారి నర్సింగ్ రావు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద అగ్నిమాపక శాఖ సూచించిన నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని నిజామాబాద్ ఫైర్ స్టేషన్ అధికారి నర్సింగ్ రావు తెలిపారు. అందుకు సంబంధించిన తెలంగాణా రాష్ట్ర వివత్తు స్పందన అగ్ని మాపక శాఖ, నిజామాబాద్ జిల్లా అధికారులు ప్రజలకు తెలియజేశారు.

గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ధూపం, దీపం, కొవ్వత్తులను జాగ్రత్తగా వెలిగించండి. బట్టలకు సంబంధించిన వస్తువులను దగ్గరగా ఉంచకండి. ఇసుకతో వేసిన బెడ్ పై దీపంను ఉంచండి. గణేష్ విగ్రహాల మండపం వద్ద కచ్చితం గా రెండు డ్రమ్ముల నీరుతోపాటు రెండు బకెట్ల నీరు ఉండాలి. రెండు బకెట్ల పొడి ఇసుక ను ఏర్పాటు చేసుకోవాలి. వినాయక మండపాలలో ఫైర్ ఎక్సింగ్విషర్ (అగ్ని ని ఆర్పే సాధనాలు) తప్పనిసరిగా ఉంచాలి. గణేష్ విగ్రహాల మండపాల వద్ద తప్పని సరిగా లోనికి వెళ్ళడానికి, బయటకి రావడానికి కచ్చితంగా సరిపోవు దారి ఏర్పాటు చేయటంతో పాటు, పూర్తిగా మూసివేయబడిన మండపాల్లో ఎంట్రీ, ఎగ్జిట్ సైన్ బోర్డ్స్ ఉంచండి.

గణేష్ మండపం వద్ద వాడే డెకరేటివ్ వస్తువులను మండని వస్తువులు ఉండేటట్లు గా చూసుకోవాలి. మిగిలిపోయిన ఎక్కువగా ఉన్న వస్తువులను మండపంలో, మండపం కింద స్టోర్ చేయరాదు. మండపాల వద్ద ఐఎస్ఐ మార్క్ ఉన్న విద్యుత్ ఉపకరణాలను వాడాలి. లూస్ వైరింగ్ లేకుండ చూసుకోవాలి. మండపాల దగ్గర రీజిల్ జనరేటర్ డీజిల్ జనరేటర్ ఉన్న కనీసం మండపం నుండి 5 మీటర్ల దూరం పాటించాలి. అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెంటనే 101కి, లోకల్ ఫైర్ స్టేషన్ నెంబర్‌కి కాల్ చేయాలి.

గణేష్ మండపాల వద్ద చేయకూడని పనుల పనులు..

గణేష్ మండపాల దగ్గరగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటివి స్టోర్ చేయకూడదు. గణేష్ మండపాలకు ఉంచిన ఎంట్రీ, ఎగ్జిట్ లను ద్వారములను మూసివేయకూడదు. జన సమూహం కాకుండా చూసుకోవాలి. గణేష్ విగ్రహాల మండపాలకు దగ్గరగా బాణాసంచా పేల్చరాదు, నిల్వ చేయరాదు అని తెలియజేశారు.

ప్రజలు ఫోన్ చేయవలసిన నంబర్లు

అగ్ని మాపక శాఖ నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ ఫైర్ స్టేషన్ 8712699224, 8712699225, నిజామాబాద్ రూరల్ ఫైర్ స్టేషన్8712699230, 8712699231, ఆర్మూర్ ఫైర్ స్టేషన్ 8712699228, 8712699229, భీమ్ గల్ ఫైర్ స్టేషన్ 8712699232, 8712699233, బాల్కొండ ఫైర్ స్టేషన్ 8712685797, 8712685798,

నందిపేట్రూర్ స్టేషన్ ఫైర్ స్టేషన్ 8712685799, 8712685800, బోధన్ ఫైర్ స్టేషన్ 8712699226, 8712699227, జిల్లా ఫైర్ ఆఫీసర్ నిజామాబాద్ 8712699141, కంట్రోల్ రూం హైదరాబాద్ 8712699444, 8712699464 నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలియజేశారు.

సెప్టెంబర్ 17ను

ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడం సంతోషకరం

- సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరులను స్మరిస్తూ ఈ నెల 17న అధికారికంగా నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు అని సిపిఐ నాయకులు అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు నరరూప రాక్షసులుగా చెలరేగిన రజాకారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 4వేల మంది సిపిఐ కార్యకర్తలు ప్రాణ త్యాగం చేశారని అన్నారు. దొరల గడీలలో వెట్టిచాకిరి విముక్తి కోసం బాంచన్ దొర అన్న ప్రజలతో బంధూకులు పట్టించిన చరిత్ర కమ్యూనిస్టులదేనని అన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వాన 1947 సెప్టెంబర్ 11న ప్రారంభమైన పోరాటం భూమికోసం, భుక్తి కోసం, మాతృభూమి విముక్తి కోసం జరిగిందని తెలిపారు. ఈ పోరాటం మూలంగానే హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం అయ్యిందని ఈ పోరాటాన్ని స్మరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం పేరుతో అధికంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ పోరాటాన్ని గుర్తించి అధికారికంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఐ జిల్లా కౌన్సిల్ పక్షాన ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల కార్యాలయాలతో పాటు విద్యాసంస్థల్లో కూడా జాతీయ జెండాలు ఎగురవేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలని సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసిన ప్రజా పాలన దినోత్సవం పేరును తెలంగాణ సాయుధ రైతంగ పోరాట అమరవీరుల దినోత్సవంగా నామకరణం చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య సిపిఐ జిల్లా నాయకులు మంద. స్వరూప రాణి, బి.రఘురాం, బొంబాయి, గంగారం, ఆలీ ఇమ్రాన్, పి.హనుమాన్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

- 11మంది లబ్ధిదారులకు చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో ఉప్లూర్, కమ్మర్‌పల్లి గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఉప్లూర్ డాకూరి అరుణకు రూ.60వేల చెక్కును స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారు ఇంటికి వెళ్లి అందజేశారు. లబ్ధిదారులు బొడ్డు గిరీష్ కుమార్‌కు రూ. 29వేలు, సుంకేట భూమయ్యకు రూ.17వేలు, కారపు సురేష్‌కు రూ.60వేలు, మేళ్ల సాయి శ్రీజకు రూ.21.500, సల్లూరి గంగకు రూ.30వేలు, వన్నెల దాస్ దయానంద్‌కు రూ.90వేలు, వేముల చిన్న నరసయ్యకు రూ.22వేలు, సిలువేరి భూమేశ్వర్‌కు రూ.60వేలు, సధిరం పోషన్నకు రూ.45వేల ఆర్థిక సహాయం చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసింది. అట్టి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉప్లూర్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందర్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోనగిరి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్ముల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో పూర్తిస్థాయి పౌష్టికాహారం

- మండల విస్తరణ అధికారి వై.శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి అంగన్వాడీ కేంద్రలలోనే పూర్తిస్థాయి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని మండల విస్తరణ అధికారి వై.శంకర్ సూచించారు. గురువారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అందించే ఆహారాన్ని తప్పకుండా తీసుకోవాలని గర్భిణీ స్త్రీలకు బాలింతలకు సూచించారు. పూర్తిస్థాయి విటమిన్లు గల ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు లాంటి ఆహారాన్ని తీసుకోవాలని ప్రసవానికి అవసరమయ్యే హిమోగ్లోబిన్‌ను పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ శోభ, అంగన్వాడీ టీచర్లు ఆసిఫా, వనజ ఆరోగ్య కార్యకర్తలు భానుప్రియ, వెంకటరెడ్డి, ఆశా కార్యకర్తలు పాశం జ్యోతి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పలువురు

వీధి కుక్కల పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలో వీధి కుక్కల నియంత్రణలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది నగరంలోని పులాంగ్ ప్రాంతంలో వీధి కుక్కలను గురువారం పట్టుకున్నారు. జిల్లాలో వీధి కుక్కల వరుస దాడులతో ప్రజలను ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సంబంధిత నిజామాబాద్ మున్సిపల్ అధికారులు స్పందించారు. ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) ఇన్చార్జి నటరాజ్ గౌడ్, సూపర్‌వైజర్ సునీల్ నేతృత్వంలో పలు కాలనీల్లో కుక్కలను పట్టుకున్నారు. నగరవాసులకు కుక్కలతో ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూం (08462-220234)కు ఫోన్ చేయాలని సూచించారు.

పంచముఖి గణేష్ మండలి లడ్డు వేలం

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని బీడీ కార్మికుల కాలనీలోని పంచముఖి హనుమాన్ గణేష్ మండలి వారు ఏర్పాటు చేసిన లంబోదరుని లడ్డు వేలంలో రూ.2,500లకు గాండ్ల పద్మావతి-కృష్ణ గురువారం దక్కించుకున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పంచముఖి హనుమాన్ గణేష్ మండలి వారు ప్రతిష్టించిన లంబోదరుని 5 రోజులకు పెద్ద ఎత్తున హిందూ సాంప్రదాయ భజన కీర్తనలతో తరలించి గ్రామ పొలిమేరలోని ఊర చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పంచముఖి ఆలయ అర్చకులు చిరంజీవి, కాలనీవాసులు గణేష్, భాస్కర్, మారెడి రాములు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్లఅన్నదానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం వద్ద అన్న ప్రసాద కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దర్పల్లి మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి ముదిరాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, దుబాయ్ కువైట్‌లోని గ్రామ ముదిరాజ్ యువకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్న వితరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో హస కొత్తూర్‌రోడ్‌లో పద్మశాలి విజయ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద సింగపూర్ ఎన్నారై శ్రీశైలం-ప్రతిభ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి కుల బంధువులతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మోపాల్ : మండలంలోని బోర్గాం (పి) గ్రామంలోని వినాయకుడి వద్ద గ్రామ పెద్దలతో కలిసి ఎస్సై యాదగిరిగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పటు అన్నదాన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, సూర్యరెడ్డి, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం అందించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

వరదల్లో నష్టపోయిన బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం బిజెపి శాసనసభపక్ష కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ విధివిధానాలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అనుసరించాల్సిన విషయాలపై బిజెపి శాసనసభ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి ఎంపీలు ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తదితర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు


ప్రథమ స్థానంలో నిలిచిన లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు

నవతెలంగాణ-మెండోర

ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి కబడి సబ్ జూనియర్ క్రీడా పోటీల్లో లిటిల్ ఫ్లవర్ పోచంపాడ్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 68వ ఎస్‌జిఎఫ్ ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడోత్సవాలు 2024 లో అండర్-14 సబ్ జూనియర్స్ బాలుర కబడ్డీ ఆటలో ప్రథమ స్థానాన్ని దక్కించ్చుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. చదువుతోపాటు విద్యార్థులను ఆటల పోటీలలో రాణించేలా ప్రోత్సాహాన్ని అందిస్తూ తీర్చి దిద్దుతున్న సహఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కబడ్డీ పోటీలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులు అభినందించారు. మున్ముందు ఉన్నత స్థాయి క్రీడలకు ఎంపిక అయ్యి భవిష్యత్తులో మంచి స్థానాన్ని సాధించాలని అన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని జేసీపీయస్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి విట్టల్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు పరచాలని, బీసీ కులగణన ఆధారంగా బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమం సంఘం తరపున, జాతీయ చేనేత పద్మ సమైక్య జేసీపీఎస్ నిజామాబాద్ తరపున విన్నవించుకుంటున్నామని జాతీయ చేనేత పద్మ సమైక్య తరపున అయన కోరారు.

దండిగుట్ట అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దండిగుట్ట అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను ప్రారంభించినట్టు ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ చిన్నారులతోపాటు గర్భిణీ బాలింత మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. గర్భిణీ బాలింత మహిళలకు ఆకుకూరలు కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలని ఆమె సూచించారు. చిన్నారులకు బాలమృతం తప్పకుండా అందించాలని అంగన్వాడీ టీచర్ ఆదేశించారు. ఎత్తు బరువు కొలతల ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. మహిళలు తమ ఇంటి పరిసర ప్రాంతాలలో ఆకుకూరలు కాయగూరలు తోటలను పెంచాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రాజమణి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

కుక్కదాడిలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని ఏఆర్‌పి గ్రామానికి చెందిన సుందర్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై ఆయన సమీప బంధువులైన బాపునగర్ గ్రామానికి వెళ్లారు. మోటార్ సైకిల్ పక్కన పెట్టి బంధువుల ఇంట్లోకి వెళ్ళే సమయంలో అక్కడే ఉన్న ఓ కుక్క కరవడంతో సుందర్ అనే వ్యక్తికి గాయపడ్డారు. ఆయన బంధువులు కుటుంబీకులు ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది ఆయనకు మెరుగైన వైద్య చికిత్స నిర్వహించి టీకాలు వేశారు. కుక్కలు సంచరించే ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది తెలిపారు.

కానరాని కట్కరకానాలు

నవతెలంగాణ-ముప్కాల్

అనగనగా ఒక ఊరు ఆ ఊరిలో వంద గేదెలు, అందులో ఓ గేదె దొంగ చాటుగా వెళ్లి సాగు చేసిన పంట పొలాల్లో మేత మేస్తుంది. మేత మేస్తున్న గేదెను పంట యజమాని చూసి బంధించి, గేదె యజమానితో గొడవలకు పోయేవారు. దాంతో పంట యజమాని, గేదె యజమానిలు ఇద్దరు గ్రామంలో పలువురు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టుకుని సమస్యపై మాట్లాడుకునేవారు. దీంతో గ్రామంలో ఇలా ఒకరినొకరు గొడవలతో బద్ధ శత్రువులుగా తయారయ్యే వారు. ఇదే కాకుండా మూగజీవాలు గ్రామంలో దొంగ చాటుగా మేత మేయడం, జీవాల యజమానులు వాటిపై సమగ్రంగా దృష్టి సారించకపోవడంతో తరుచూ పల్లెల్లో గొడవలు జరిగేవి. దీనికి పరిష్కారమార్గంగా గ్రామ పెద్దలు ఒక ఆలోచనకు వచ్చారు. ఆ ఆలోచననే ఈ కట్కరకానాలు..

గ్రామంలోని మూగజీవాలు (గేదె, ఆవు, దూడ, ఎద్దు, మేక, గొర్రె)లు ఇలా ఏవైనా తప్పు చేస్తే వాటిని బంధించి కట్కరకానాల్లో ఉంచేవారు. కట్కరకానాల బాధ్యతలను గ్రామంలో ఒకరికి అప్పగించేవారు. గ్రామంలో జీవాల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెల పక్కన ఒక గేటు సహాయంతో ప్రహరీ నిర్మించి అందులో బందించేవారు. బాధ్యత తీసుకున్న వ్యక్తి గ్రామంలో సంచరిస్తూ, చేలను మేసే జీవాలను పట్టుకొని కట్కరకానాల్లో బంధించేవారు. సమాచారం ఇచ్చిన అట్టి జీవాలను బంధించేవారు. తర్వాత ఆయా జీవాల యజమానులు కట్కరకానాల బాధ్యత ఉన్న వ్యక్తితో మాట్లాడి తగిన జరిమానా కట్టి వారి వారి జీవాలను యజమానులు తీసుకెళ్లేవారు. ఇలా జరిమానా విధించిన వాటిల్లో నుంచి కొంత మేర డబ్బును గ్రామానికి ఆదాయం చూపుతూ, మిగితా కొద్ది డబ్బును వేతనంగా నిర్ణయించేవారు. ఇలా పల్లెల్లో కట్కరకానాలు కొనసాగుతుండేవి. తద్వారా గ్రామాల్లో గొడవలు సద్దుమణిగాయి. ఇప్పుడు పల్లెల్లో కట్కరకానాల బాధ్యతలు తీసుకునేవారు లేక అట్టి వ్యవస్థ పూర్తిగా కానరాకుండాపోతుంది. దీంతో మూగజీవాలు గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ పలు నష్టాలను కలుగజేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మూగజీవాలు అటు సాగు చేసిన పంటలకు నష్టం కలుగజేస్తూ, మరోవైపు ప్రధాన రోడ్లపై సంచరిస్తూ రోడ్డు ప్రమాదాలకు సైతం కారణమౌతున్నాయి. తిరిగి కట్కరకానాల వ్యవస్థను పల్లెల్లో పునరుద్ధరణ చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు..



గతంలో గ్రామంలో ఏర్పాటుచేసిన కట్కరకానా

కట్కరకానాలను ప్రారంభించాలి

కట్ట గోపి, రైతు,ముప్కాల్



కట్కరకానాల వ్యవస్థ పూర్తిగా కనుమరుగౌతున్న వేళ తిరిగి మొదలుపెడితే బాగుంటుంది. గ్రామాల్లోని పెద్దలు ఆనాటి ఆలోచనలతో కట్కరకానాల బాధ్యతలను ఒకరికి అప్పగించాలి. కట్కరకానాల బాధ్యతలు చూసే వారు లేకపోవడంతో సాగు చేస్తున్న పంటలను, ఇండ్ల ముందు పెంచిన చెట్లను నాశనం చేస్తున్నాయి. ఈ విషయాలను గ్రామ పెద్దలు దృష్టిలో పెట్టుకుని కట్కరకానాలను ప్రారంభించాలి..

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

ప్రధానోపాధ్యాయులు రమేష్



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-ఎడపల్లి

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని ఏఆర్‌పి క్యాంప్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అన్నారు. గురువారం మండలంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక (విద్యార్థిని), నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 14 ఇయర్స్ బాలికల ఖోఖో పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని అమూల్య ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు మౌలాలి హౌసింగ్ బోర్డ్ బాలాపూర్ హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో అమూల్య పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. 34వ సబ్ జూనియర్ ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడానికి వ్యాయామ ఉపాధ్యాయురాలు సౌజన్య ముఖ్య పాత్ర పోషించారని ఆయన కొనియాడారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌తోపాటు ఉపాధ్యాయ బృందం అమూల్యతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు సౌజన్య అభినందించారు. సందర్భంగా పాఠశాల బాలిక అమూల్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు సౌజన్యను పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ నవ్య భారతి గ్లోబల్‌లో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్ గురువారం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపికకు ఉమ్మడి జిల్లాల వివిధ స్కూల్స్ , కాలేజ్ ల నుండి120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14,15తేదీల్లో హన్మకొండ జే ఎన్ స్టేడియంలో జరగబోయే 38వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా పేట సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి పాల్గొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గట్టడి రాజేష్ మరియు హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, నవ్య భారతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ షెల్లి, హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు కొండ్రా అంజు, అజ్మత్, సురేష్ సంజీవ్, నవీన్, రహుల్, గోవింద్ సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

రైల్వే ఓవర్ బ్రిడ్జిలు.. నీటి మడుగులు

- రాక పోకలకు ఇబ్బందులు
- శాశ్వత పరిష్కారమే లేదా?



ఎంఇవో కార్యాలయం ముందు నుంచి పంట పొలాలకు వెళ్ళే దారిలో



నాగాపూర్ వెళ్ళే దారిలో..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రమైన కమ్మర్ పల్లిలో, నాగాపూర్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద దారులు వరద నీటి నిలువకు నిలయంగా మారాయి.దీంతో రాక పోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరగక ముందు నుండే ఈ సమస్య ఉంది.బ్రిడ్జిల నిర్మాణం జరిగినా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు.కమ్మర్‌పల్లిలో ఉప్లూర్ గ్రామానికి వెళ్ళే రహదారిలో, మండల విద్యా వనరుల కేంద్రం ముందు నుండి పంట పోలాలకు వెళ్ళే దారిలో, గుండ్ల కుంట చెరువుకు వెళ్ళే దారిలో, నాగాపూర్ గ్రామానికి వెళ్ళే రహదారిలో, మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి వెళ్ళే రహదారిలో ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు. రైల్వే ట్రాక్ నిర్మాణ సమయంలోనే ట్రాక్ మధ్య గుండా ఉన్న ఈ దారులు లోతట్టుగా మారి చినుకు రాలితే చాలు వరద నీరు వచ్చి దారులను కమ్మేసేవి. బ్రిడ్జిల కింద చదును పనులు జరిగాక దారులు పూరిగా చక్కబడతాయని అంత భావించారు. కానీ దారులు లోతట్టుగానే ఉండి పోయి, నిలిచిన వరద నీరు దారులపై నుండి దూరంగా ప్రవహించే ఏర్పాట్లు సమగ్రంగా జరగలేదు.మండల విద్యా వనరుల కేంద్రం ముందు నుండి పంట పోలాలకు వెళ్ళే దారి గుండా నిత్యం రైతుల రాక పోకలు అధికంగా ఉంటాయి.ప్రస్తుతం ఖరీఫ్ పనులపై రైతులు ఎడ్ల బండ్లపై, ద్వి చక్ర వాహనాలపై, మోటారు సైకిళ్ళపై, సైకిళ్ళపై ఎరువులు, విత్తనాల బస్తాలతో, వ్యవసాయ పరికరాలతో వెళ్తున్నప్పుడు బ్రిడ్జి కింద ఈ దారి నిండా నిలిచిన వరద నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఉప్లూర్, నాగాపూర్, తిమ్మాపూర్ దారుల్లో బ్రిడ్జిల గుండా ప్రయాణించే వారికీ ఇలాంటి తిప్పలే తప్పడం లేదు. వరద నీటి గుండా వెళ్తుంటే ఎదురుగా వచ్చే వాహనం ద్వారా బురద నీరు పడుతుంది. దీంతో దూర ప్రయాణాలు చేసే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్రిడ్జిల కింద నిలిచిన నీరు దూరంగా ప్రవహించేలా కాలువలను సరి చేయాలని, సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యువత, మహిళల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తాం

- డిఆర్‌డిఎ, పిడి.సురేందర్



పీడీని సన్మానిస్తున్న ముదిరాజ్ మహాసభ సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని యువత విద్యార్థుల, మహిళల నైపుణ్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని డిఆర్‌డిఏ, పిడి సురేందర్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ పీడీని గురువారం ఘనంగా సన్మనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో యువత, మహిళలు అధిక సంఖ్యలో విద్య, స్వయం ఉపాధి అవకాశాలు లేక అల్లాడుతున్నారని, నిరుద్యోగం పెరుగుతుందని తెలిపారు. ఇందుకు కారణం జిల్లాలో చిన్న తరహా, మధ్యతరహా, భారీ పరిశ్రమలు లేకపోవడం, మల్టీమీడియా, వెబ్ ఆధారిత కోర్సులలో ప్రవేశానికి జిల్లా కేంద్రంలో శిక్షణ సెంటర్ లేక విద్యార్థులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో నిరుద్యోగులుగా మారుతున్నారని వివరించారు. అనంతరం డిఆర్‌డిఏ, పిడి సురేందర్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువత, మహిళలతో సమన్వయం చేసుకుంటూ నేటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని నైపుణ్యాభివృద్ధి కృషి చేస్తామన్నారు. నిరంతరం ఉద్యోగ మేళాలు నిర్వహిస్తూ వివిధ రకాలైన కంపెనీలతో ప్రభుత్వ, ప్రవేట్ రంగాలలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు సాయికుమార్ ముదిరాజ్, బాలయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను వేధిస్తే సహించేది లేదు

- స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్



మాట్లాడుతున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్

నవతెలంగాణ ఆర్మూర్

కుటుంబ పెద్దలను గౌరవించాలని తల్లిదండ్రులను వేధిస్తే సహించేది లేదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ అన్నారు. మండలంలోని కోమన్‌పల్లి గ్రావ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సీనియర్ సిటిజన్లకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షులు భూమన్న మాట్లాడుతూ వృద్ధులను నిరాశపరచకుండా వారి అనుభవాలను పరిగణలోకి తీసుకొని ప్రముఖుల, దాతల సహకారాలతో రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షులు నల్ల రాజారెడ్డి, నారాయణ వర్మ, లింగారెడ్డి, రాజన్న, నారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏడు మండలాల నుండి 20 మంది విశిష్ట సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రజనీష్ కిరాడ్, కార్యదర్శి రాస ఆనంద్, ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ నిర్వహించిన ప్రాజెక్ట్ చైర్మన్లు విజయ సాధి, పుష్పాకర్ రావు, చౌటీ లింబాద్రి, కాంతి గంగారెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష ఉపన్యాసంలో సభాధ్యక్షులు రజనీష్ కిరాడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉత్తమ సేవలందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతు న్నారని అన్నారు. దేశాన్ని సమాజాన్ని కాపాడే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా మరింత కృషి చేయాలని తెలిపారు. ఈ అవార్డు మీలో మరింత రెట్టింపు ఉత్సాహాన్ని పెంచాలని ఈ ఉత్తమ టీచర్ అవార్డును అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా గడ్డం చరణ్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఖాందేశ్ సత్యం, విద్యా గోపికృష్ణ, లక్ష్మీనారాయణ,లక్ష్మీ నర్సయ్య,సురేష్,నరేష్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంధర్,వన్నెల దేవి రాము,సన్మాన గ్రహీతలు,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వస్తువులు కొనుగోలు చేసినప్పుడు బిల్లు తీసుకోవాలి

- వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావార్ రాజేశ్వర్
- వినియోగదారుల హక్కులపై అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్

వాణి ఒకేషనల్ జూనియర్ కాలేజ్ లో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయా వార్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులు వినియోగదారుల హక్కులను తెలుసుకోవాలన్నారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా బిల్లులు తీసుకోవాలని తెలిపారు. బిల్లులు ఉన్నప్పుడే వినియోగదారుల కమిషన్‌లో కేసు వేసుకోవడానికి వీలుంటుందని ఆయన తెలిపారు. ఆహార కల్తీలపట్ల గాని తూనికల కొలతల్లో మోసాలు జరిగితేగాని ఎమ్మార్పీ కంటే ఎక్కువ వ్యాపారస్తులు డబ్బులు వసూలు చేసినట్లయితే జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రానికి వినియోగదారులు తెలియజేయాలని ఆయన కోరారు. వినియోగదారుల రక్షణ చట్టం 1986లో రావడం జరిగిందని, నూతన వినియోగదారుల చట్టం 2019లో రావడం జరిగిందని తెలిపారు. కావున విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలని అన్నారు. వినియోగదారుడు నష్టపోతే జిల్లా వినియోగదారుల కమిషన్‌లో 50 లక్షల వరకు నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. వినియోగదారుడు సేవలు పొందినప్పుడు కానీ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు కానీ తప్పకుండా రసీదు బిల్లు తీసుకోవాలని అన్నారు. బిల్లు ఉన్నట్లయితేనే వినియోగదారులు కమిషన్‌లో కేసు వేసుకోవడానికి వీలుంటుందని రాజేశ్వర్ తెలిపారు. వినియోగదారులు ఐఎస్ఐ మార్క్ ఉన్న వస్తువులనే కొనుగోలు చేయాలని అన్నారు. బిల్లుతోపాటు గ్యారంటీ, వారంటీ కార్డు పొందాలని వినియోగదారులు తెలుసుకొని వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు రాజేశ్వర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాయావార్ రాజేశ్వర్

పిడిఎస్ బియ్యం పట్టివేత

- నలుగురి బైండోవర్

నవతెలంగాణ-దోమకొండ



పీడీఎస్ బియ్యం పట్టుకున్న అధికారులు

అక్రమంగా పిడియస్ బియ్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులను దోమకొండ మండల కేంద్రంలో పట్టుకొని కేసు నమోదు చేసి బైండోవర్ చేశామని ఎస్సై ఆంజనేయులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ కిష్టయ్య గురువారం తెలిపారు. మండల కేంద్రంలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న భవానీపేట్ తాండ గ్రామానికి చెందిన అజ్మీరా వెంక్యా, అజ్మీర అరవింద్, భూక్య నరేందర్ ద్విచక్ర వాహనంతో పాటు మిగితా రెండు వాహనాలలో 7క్వింటాళ్ల 50 కిలోల పిడిఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్న దోమకొండ గ్రామానికి చెందిన కస్ప ప్రశాంత్ రైస్‌మిల్ యజమానిని పట్టుకొని నలుగురిపై కేసు నమోదు చేసి దోమకొండ తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంజయ్‌రావు ఎదుట పీడీఎస్ బియ్యంకు సంబంధించిన నేరాలు చేయకుండా బైండోవర్ చేశామని తెలిపారు. గతంలోనూ నలుగురు వ్యక్తులపైన పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పైన కేసులున్నాయని తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి

- పిడి సురేందర్, మండల ప్రత్యేకాధికారి జ్యోతి

నవతెలంగాణ-దోమకొండ

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పెరటి కోళ్ళ పెంపకం ద్వారా తమ ఆర్థికాభివృద్ధిని పెంచుకోవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. మండల కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు గురువారం పెరటి కోళ్లను 40 మంది మహిళలకు 800 కోళ్లను పంపిణీ చేసి డంపింగ్ యార్డును, కంపోస్టు షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సంఘం, మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. గ్రామాలలో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించి విడిగా వేసి కంపోస్టు ఎరువు తయారీ చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేపట్టాలని తెలిపారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్‌ను వేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపిడివో ప్రవీణ్ కుమార్, ఏపిఒ రాజు, ఏఈ ప్రదీప్, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు కూలిపోయిన ఇండ్ల బాధితులను ఆదుకుంటాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

గత కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన ఇండ్ల బాధితులు ఎవరూ బాధపడవద్దని వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని ఆరవ వార్డులోని పాత రాజంపేట గ్రామంలో గత కొద్దిరోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు మల్లయ్య ఇల్లు కూలిపోవడంతో విషయం తెలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ వెంటనే స్పందించి ఆ ఇల్లును రెవెన్యూ ఆర్ఐ నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలో ఎవరైతే ఇల్లు కూలిపోయాయో త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మా సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్, పిడుగు మమత సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.